# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 305 | పేజీలు: 4 | వెల: రూ.4/- | బుధవారం 1 జులై 2026 | ఎడిటర్: ఎం.వనిత రెడ్డి



## రైతుభరోసా విడుదల

**తెలంగాణ రైతుల ఖాతాల్లో భరోసా నిధులు**

**శిల్పకళావేదికగా రైతుభరోసా విడుదల**

**44.28 లక్షల మంది రైతులఖాతాల్లో రూ.2,482 కోట్ల జమ**

**మంత్రులతో కలసి నిధులను విడుదల చేసిన సీఎం రేవంత్**

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే ఉదయం)

తెలంగాణలో రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. తొలి విడతలో రెండు ఎకరాల లోపు భూమి కలిగిన 44.28 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,482 కోట్లను నేరుగా జమ చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. శిల్పకళా వేదికగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావులతో కలసి నిధులను విడుదల చేశారు. రైతుల పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. 30 నెలల ప్రజాపాలనలో రైతు తలెత్తుకునేలా పాలన అందిస్తున్నామని అన్నారు. వ్యవసాయం దండగ కాదని, పండుగగా భావించే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు ఉండగా, 2023 నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందని అన్నారు. గత పదేళ్లలో దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కల్వకుంట్ల కుటుంబం చేసిన అప్పులు, తప్పుల భారం ఇప్పుడు తమ ప్రభుత్వం భరిస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. 'బకాయిలు పెట్టింది బకాసురుడు... కట్టే పాపం మాకా' అంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో జీతాలు చెల్లించే పరిస్థితి ...మిగతా 2లో

# ఎవ్వరికీ పదవులు శాశ్వతం కాదు

**ఎన్టీఆర్, ఇందిర లాంటి వారే ఓడారు**

**పదవి శాశ్వతం అని నేను కూడా భావించడం లేదు**

**ఇచ్చిన హామీ మేరకు మంచి పనులు చేయడమే నా లక్ష్యం**

**రాష్ట్రాన్ని అప్పుల బారి నుంచి గాడిన పెడుతున్నాం**

**రైతులను రుణమాఫీ, రైతు భరోసాతో ఆదుకుంటున్నాం**

**బకాసురుడు కెసిఆర్ చేసిన అప్పులు తీర్చలేక చస్తున్నాం**

**కెసిఆర్ హయంలో జీతాలు కూడా సక్కగ ఇవ్వలేదు**

**కన్నకూతురు ఫోన్లు కూడా ట్యాప్ చేసిన ఘనుడు**

**మళ్ళీ వస్తే ఫోన్ ట్యాపింగ్ తప్ప మరేమీ ఉండదు**

**రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చే ఛాన్స్ లేదు**

**శిల్పకళావేదిక సభలో సిఎం రేవంత్ విమర్శలు**



హైదరాబాద్, జూన్ 30 (నమస్తే ఉదయం)

పదవి ఎవరికీ శాశ్వతం కాదని, కేవలం ఇచ్చిన మాటే శాశ్వతంగా ఉంటుందని.. నాడు ఇందిరమ్మ, ఎన్టీఆర్ లాంటి మహానాయకులే ఓడిపోయారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. నాకు కూడా అంతేనని, పదవి శాశ్వతంగా ఉంటుందని నేను కూడా భావించడం లేదన్నారు. అయితే ఉన్నన్ని నాళ్లు మంచి పనులు చేసి, మంచివాడని పించుకోవడమే ముఖ్యమని అన్నారు. నేను అబద్దాలు చెప్పను, చెప్పింది చేసి తీరుతా. ప్రజలకు నచ్చకపోయినా ఉన్నది ఉన్నట్లే చెప్తాను అని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజలది, రైతులది, ఆడబిడ్డలది అని భరోసా ఇచ్చారు. కేసీఆర్ లాంటి తప్పుడు పనులు తాను ఎప్పటికీ చేయనని చెప్తూ.. ఆ పశుపతిని (కేసీఆర్‌ను) నీ ఫార్మ్‌హౌస్‌లోనే బంధించాను, ఇక బయటకు రానిచ్చే ప్రసక్తే లేదు' అని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. శిల్పకళావేదిక వేదికగా జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పాలకుల తీరును ఎండగడుతూ పదునైన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు బకాసురుడిని తీసుకెళ్లి ఫార్మ్‌హౌస్‌లో కూర్చోబెట్టారని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆయన అన్నీ మీకే చేశాడని, మళ్లీ అధికారంలోకి రావాలని అంటున్నాడు. అసలు మనకేం చేశాడు మళ్లీ ఎందుకు వస్తాడు అని సీఎం ప్రశ్నించారు. గత పదేళ్లలో అగ్రికల్చర్, హార్టికల్చర్‌లను పూర్తిగా పక్కనపెట్టేసి, రాష్ట్రంలో 'డ్రింకింగ్ కల్చర్' తీసుకువచ్చారని మండిపడ్డారు. బకాసు9రుడు చేసిన అప్పులను మేము తీరుస్తున్నామని అన్నారు. మళ్లోసారి కేసీఆర్ వస్తే భార్యాభర్తల మాటలను వినడం తప్ప చేసేదేమీ లేదన్నారు. కన్న బిడ్డ కవిత, అల్లుడు మాట్లాడుకున్న మాటలు విన్నారని ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ ఘాటు విమర్శలు చేశారు. 30 నెలల్లో రైతు సంక్షేమం కోసం అనేక పనులు చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. 19 మంది ముఖ్యమంత్రులు రాష్ట్రానికి రూ.69 వేల కోట్లు అప్పు చేశారని, 2014 నాడు రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రానికి రూ.69 వేల కోట్లే అప్పు ఉందని సీఎం గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పు అయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేవలం కల్వకుంట్ల కుటుంబం ఏడు లక్షల కోట్లకు పైగా అప్పు చేసిందని సీఎం చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన టైంలో మిగులు బడ్జెట్ ఉండేదని, రాష్ట్రం కోలుకోకుండా కేసీఆర్ అప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. అప్పులు కాదు.. అందిన కాడ చేబదులు కేసీఆర్ తీసుకొచ్చారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ఉద్యోగులకు జీతాలు వాయిదాల్లో ఇచ్చారని బీఆర్ఎస్ పాలనను సీఎం రేవంత్ దుయ్యబట్టారు. ధనిక రాష్ట్రంలో జీతాలు ఇవ్వలేని స్థితికి కేసీఆర్ తీసుకెళ్లారని సీఎం రేవంత్ విమర్శించారు. కాంట్రాక్టర్లు, సర్పంచులకు బకాయిలను కేసీఆర్ ఇవ్వలేదని, కేసీఆర్ సర్కార్ వల్లే మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని సీఎం ఆరోపించారు. బకాయిలు బకాసురుడు పెడితే.. కట్టే పాపం తనపై పడిందని ...మిగతా 2లో

## రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా
# సభల పేరిట నాటకాలు

### 30 నెలల్లో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధుల ఎగవేత

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే ఉదయం)

30 నెలల పాలనలో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ఎగ్గొటారని, పైగా సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. ఏకంగా నాలుగుసార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టారని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. మంగళవారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఎక్స వేదికగా మాజీ మంత్రి విరుచుకుపడ్డారు. మీ 30 నెలల ముదనష్టపు పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతు భరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే.. నీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం. ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశావు. 72 సార్లు నీ ఢిల్లీ ...మిగతా 2లో




## భారత నూతన ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

### పదవీ బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్

న్యూఢిల్లీ,జూన్30 (నమస్తే ఉదయం)

భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ విభాగం నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో కమిషన్డ్ అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్టర్న్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో కేపబిలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.



## జన్మతః పౌరసత్వం..
# ట్రంప్‌నకు సుప్రీంలో షాక్



న్యూయార్క్, జూన్ 30 (నమస్తే ఉదయం)

అమెరికా సుప్రీం కోర్టులో అధ్యక్షుడు ట్రంప్‌నకు చుక్కెదురైంది. జన్మతః పౌరసత్వాన్ని పరిమితం చేయాలన్న ట్రంప్ ప్రతిపాదనలను అక్కడి సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. జన్మతః పౌరసత్వాన్ని అమెరికా సుప్రీం కోర్టు సమర్థించింది. కొన్ని పరిమితులు మినహా.. ఇక్కడ పుట్టిన ప్రతి ఒక్కరూ దేశ పౌరులేనని స్పష్టం చేసింది. విదేశాలకు చెందిన దంపతులకు అమెరికాలో పిల్లలు పుట్టినప్పటికీ వారికి ఆ దేశ పౌరసత్వం వర్తించబోదని వాదిస్తున్న ట్రంప్.. ఇందుకు సంబంధించి అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ''పౌరసత్వం అనేది అప్పుడూ, ఇప్పుడూ.. మన రాజకీయ సమాజంలో స్వేచ్ఛగా పాల్గొనే ...మిగతా 2లో



# దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

### మనం అభివృద్ధి చెందడమే కాదు..వెనక ఉన్నవారిని ముందుకు తీసుకెళ్లాలి

### గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

విశాఖపట్నం, , జూన్ 30 (నమస్తే ఉదయం)

దేశ నిర్మాణంలో విద్యావంతులైన యువతదే అత్యంత కీలక భూమిక అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. 'నేను కూడా ఒక మారుమూల గ్రామం నుంచి వచ్చిన మొదటి గ్రాడ్యుయేట్‌ను. ఈరోజు ఇంతమంది యువతీయువకులకు పట్టాలు అందించడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోందని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో సమాజంలో ఇంకా వెనుకబడి ఉన్న అట్టడుగు వర్గాలను మరవకూడదని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. 'మీరు జీవితంలో ముందుకు వెళ్లడమే కాదు.. ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఎందరో పేదలు, అట్టడుగు వర్గాల వారు కనిపిస్తారు. వారిని ప్రోత్సహించడంలో మీ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా యువత పాత్ర ఎంతో కీలకమని, దేశ మాజీ రాష్ట్రపతి ...మిగతా 2లో

## ఆలయ భూ కేటాయింపుల్లో
# పారదర్శకత

### యాజమాన్య హక్కులు ఆలయాలకే ఉండాలి



**తిరుమల తరహా విధానం అధ్యయనం చేయండి**

**అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం**

2

# యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే ఉదయం)

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలో వివిధ మతాలకు భూముల కేటాయింపునకు సంబంధించి స్పష్టమైన విధానం రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భూ యాజమాన్యపు హక్కులు దేవస్థానానికే ఉండాలన్నారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపై మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఆలయం పరిధిలో భూముల కేటాయింపు విషయంలో తితిదే అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయాలని రేవంత్ సూచించారు. యాదగిరిగుట్టలో హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ కోసం మార్కెట్ ధర ప్రకారం భూమిని కేటాయించాలన్నారు. గుట్టపై అతిథి గృహాల నిర్మాణం కోసం ముందుకు వచ్చే వారి జాబితా రూపొందించాలని, ఈ విషయంలోనూ తితిదే విధానాన్ని అనుసరించాలన్నారు. దశల వారీగా అనుమతులు మంజూరు చేయాలని సీఎం చెప్పారు. కుల సంఘాలకు స్థలం కేటాయింపుపైనా స్పష్టమైన నిబంధనలతో కూడిన విధానం రూపొందించాలని ఆదేశించారు. ఆలయ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు భూ సేకరణ కోసం తక్షణమే నిధులు మంజూరు చేయాలన్నారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సీఎం రేవంత్ ప్రారంభించారు. రెండు అంబులెన్స్‌లతో పాటు భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సమకూర్చిన ఎంఆర్ఐ స్కానర్‌ను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రతినిధులతో సీఎం మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల నుంచి రుణాల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయని.. విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు.



# ఎవ్వరికీ పదవులు శాశ్వతం కాదు

మొదటి పేజీ తరువాయి



సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. స్కూల్లోని పిల్లలకు మిడ్ డే మీల్స్ పెట్టేవాళ్లకు బకాయిలు పెట్టారని.. బీఆర్ఎస్ సర్కార్ అప్పులే కాదు.. తప్పులు కూడా చేసిందని సీఎం విమర్శించారు. దేశంలో ఎక్కడికి పోయినా ఇజ్జత్ పోయేలా కేసీఆర్ చేశారని, చంద్రశేఖర్ దెబ్బకు రాష్ట్రంలోని ప్రజలంతా బికారులయ్యామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తవ్వుతున్న కొద్దీ.. గుట్టల కొద్దీ అప్పులు బయటపడ్డాయని.. బీఆర్ఎస్ హయాంలో కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇదే వేదికపై నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై కూడా రేవంత్ రెడ్డి విమర్శనా స్త్రాలు సంధించారు. దేశంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోదీ, ఆ ఉద్యోగాలు ఎవరికిచ్చారని నిలదీశారు. ఇక్కడ ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయని, వారు కిషన్ రెడ్డి, బండి సంజరు అని ఎద్దేవా చేశారు. 'అక్కడ పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కాబట్టి మీ పప్పులు ఉడికాయి. బెంగాల్‌లో గెలవడానికి మీకు 15 ఏళ్లు పట్టింది. కానీ ఇక్కడికి మీరా వచ్చేది ఇక్కడ మావాళ్లు ఉన్నారు, దంచి కొడతారు' అంటూ తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. 'దిగిపోవడానికి ఇది నీ అయ్యా జాగీరా మేము మీకేం బానిసలం కాదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు రైతులను వరి వేసుకుంటే ఉరే అన్న కేసీఆర్, ఆయన మాత్రం ఫార్మ్‌హౌస్‌లో వడ్లు పండించి ఏకంగా 4200 క్వింటాళ్లు అమ్ముకున్నాడని ఆరోపించారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలినా.. ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. బోరు కింద పంటలు పండినా కాళేశ్వరం మహిమ అంటూ ప్రజలను మోసం చేశారని చెప్పారు. కేసీఆర్ ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారా దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారు పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇచ్చారా ఊరూరికి బెల్ట్ షాప్ తెచ్చి తాగుడు కల్చర్ నేర్పించారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే చేసేదేమీ ఉండదు. వరి వేస్తే ఉరే అని బెదిరించి రైతుల పంటను కొనలేదు. పేదల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ అన్నారు.. వేశారాఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఆయన చెప్పారు.. ఇచ్చారా అని ప్రశ్నించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చాం. మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తున్నామని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. మహిళలతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయించి యజమానులుగా చేశాం. రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం అన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి తక్కువ వర్షాలు పడ్డాయి. రైతుల వరిసాగు తగ్గించి మెట్ట పంటలు వేసుకోవాలి. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అనుకునేలా చేస్తున్నాం. 9 రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9వేల కోట్లు వేస్తాం. ఒక్కో సమస్యను చక్కబెట్టుకుంటూ సంక్షేమం కొనసాగిస్తున్నాం. సాగు పనులు మొదలయ్యే నాటికే రైతుభరోసా అందిస్తున్నాం. 2023లో సీఎస్ వంటి ఐఏఎస్ అధికారులకే 1న జీతాలు ఇవ్వలేని పరిస్థితి. కొన్నేళ్లుగా వాయిదాల పద్ధతిలో వస్తున్నాయని అధికారులు చెప్పారు. బడి పిల్లల తిండి బిల్లులు కూడా రూ.వేల కోట్ల బకాయిలు పెట్టారు. సర్పంచ్‌ల బిల్లులు రూ.వేలకోట్లు పెండింగ్ పెడితే.. వారు ఇప్పుడు ధర్నాలు చేశారు. బిల్లులు పెండింగ్ పెట్టింది కేసీఆర్.. ఆ బద్నాం మోసింది నేను. కేసీఆర్ చేసిన అప్పులతో దిల్లీలో కూడా పరువు పోయే పరిస్థితి వచ్చింది' అని రేవంత్ అన్నారు.





## ఆర్టీసీ కార్మికుల సేవలు అమూల్యం: ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

**గద్వాల డిపోలో ఉద్యోగ విరమణ చేసిన నలుగురు సిబ్బందికి ఘన సన్మానం**

**హాజరైన ఎమ్మెల్యే సోదరుడు రాముడు, డిపో సిబ్బంది**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 30(నమస్తే ఉదయం):**

దశాబ్దాల పాటు ప్రజలకు సురక్షితమైన రవాణా సేవలు అందించిన ఆర్టీసీ కార్మికుల నిబద్ధత, సేవలు ఎంతో అమూల్యమైనవని ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు కొనియాడారు. గద్వాల బస్ డిపోలో సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన నలుగురు విశ్రాంత ఉద్యోగుల సన్మాన కార్యక్రమం మంగళవారం డిపో ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఎమ్మెల్యే విజయుడు సోదరుడైన డ్రైవర్ రాముడు పాటు మరో ముగ్గురు సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, విశ్రాంత ఉద్యోగులను పూలమాలలతో, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎండ, వాన, రాత్రి, పగలు అని తేడా లేకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పడే శ్రమ విలక్షణమైనదన్నారు. విధి నిర్వహణను విజయవంతంగా పూర్తి చేసుకుని రిటైర్ అయిన సిబ్బంది అందరూ శేష జీవితాన్ని కుటుంబంతో కలిసి సంతోషంగా, ఆరోగ్యంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గద్వాల డిపో మేనేజర్ శ్రీధర్, కార్మిక సంఘాల నాయకులు, తోటి సిబ్బంది మరియు విశ్రాంత ఉద్యోగుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత.

**రైతు భరోసా సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 30(నమస్తే ఉదయం)**

ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యతనిస్తుందని, అందులో భాగంగానే ఇటీవల విత్తనమేళాలు నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.మంగళవారం హైదరాబాదు నుంచి ప్రతి రైతుకు ఎకరానికి రూ.12,000 పంట పెట్టుబడి సాయంను వారి ఖాతాల్లో జమ చేసే రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని గద్వాల మండలం చెనుగోనుపల్లి గ్రామ రైతువేదికలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రైతులతో కలిసి టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు, పలు శాఖల ఉన్నతాధికారులు హైదరాబాద్ నుంచి రైతు భరోసా కార్యక్రమంలో తమ ప్రసంగాన్ని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మమ్మ, పిఎసిఎస్ చైర్మన్ సుభాన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఏవో ప్రతాప్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## సిగాచీ పరిశ్రమ పేలుడు మృతులకు సంపూర్ణ నష్టపరిహారం చెల్లించాలి






**ఏడాది గడిచిన అమలుకు నోచుకోని సీఎం రేవంత్ రెడ్డి కోటి రూపాయల హామీ**

**పరిశ్రమ యాజమాన్యానికి బంటుగా రాష్ట్ర ప్రభుత్వం**

**బాధితులకు నిరంతర సహకారం.. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**బిపిఎల్ చౌరస్తాలో సిగాచి మృతులకు ఘన నివాళి**

**పటాన్ చెరు, జూన్ 30 (నమస్తే ఉదయం):**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సిగాచి దుర్ఘటన జరిగి ఏడాది గడిచిన నేటి వరకు మృతుల కుటుంబాలకు పూర్తి నష్టపరిహారం అందించడంలో పరిశ్రమ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యాయని. ఇది అత్యంత దుర్మార్గమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ధ్వజమెత్తారు . సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా దుర్ఘటన స్థలం సాక్షిగా మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందిస్తున్నామని ప్రకటించినా నేటి వరకు అమలు కాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలతో పాటు బాధితులకు సంపూర్ణ న్యాయం చేయకపోతే భారత రాష్ట్ర సమితి తరపున ప్రజా క్షేత్రంలో నిరంత పోరాటాలు చేస్తూనే ఉంటామని హెచ్చరించారు.సిగాచి దుర్ఘటన జరిగి నేటితో ఏడాది గడిచిన సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం బిపిఎల్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ మాట్లాడుతూ గత సంవత్సరం జూన్ 30వ తేదీన సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో ఘటనలో 54 మంది మృతి చెందగా 8 మంది ఆచూకీ తెలియకపోవడంతో పాటు 40 మంది తీవ్రంగా గాయపడి నేటికి నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుమారుడుని కోల్పోయిన తల్లిదండ్రులు, భర్తను కోల్పోయిన భార్య,తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు బాధలు వర్ణనాతీతమని అన్నారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగా జరిగిన ఘటనలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి అత్యంత దారుణంగా తయారైందని దుయ్యబట్టారు. ఘటన జరిగిన ఆరు నెలల అనంతరం ఒకరిని మాత్రమే అరెస్టు చేసి యాజమాన్యానికి బంటుగా ప్రభుత్వం మారిందని విమర్శించారు. ప్రమాద స్థలం సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయలు ఇస్తామని మీడియా ముఖంగా ప్రకటించి నేటికి ఏడాది గడిచిన అమలు కాకపోవడం ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతోందని విమర్శించారు. తమకు న్యాయం చేయాలంటూ బాధితుల కుటుంబాలు ప్రభుత్వ కార్యాలయాలు,. పరిశ్రమ యాజమాన్యాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కోసం పోరాడుతున్న వారిని విమర్శించడం తప్ప బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి రూ.60 లక్షల పరిహారం అందించామని చెబుతున్నది అసత్యమని, సెబీలో రూ.118 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉందని వెల్లడించారని గుర్తుచేశారు. బిఆర్ఎస్ పార్టీ ఒత్తిడి కారణంగానే ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం ఇచ్చిందని, బాధిత కుటుంబాల పట్ల ప్రభుత్వానికి కనికరం లేదని మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు నివాళి అర్పించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకుంటామంటే అనుమతించకపోవడం ప్రభుత్వ దుర్మార్గ వైఖరికి అర్థం పడుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం పూర్తిగా చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, జీవితాంతం పెన్షన్ అందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారత రాష్ట్ర సమితి తరపున నిరంతర పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతుభరోసా విడుదల

మొదటి పేజీ తరువాయి

నెలకొందని, ధనిక రాష్టామంటూ గొప్పలు చెప్పి, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకెళ్లారని విమర్శించారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు తెలంగాణ పరువు తీశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రజాపాలనలో ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద రూ.36 వేల కోట్లు రైతులకు అందించినట్లు సీఎం వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ నిలిపివేస్తారనే దుష్ప్రచారం చేశారని, కానీ 2004లో రైతులకు ఉచిత విద్యుత్‌ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. రైతుల కోసం ప్రతి నెల సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు, రైతు బీమా కోసం రూ.4 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం రూ.80 వేల కోట్లు వ్యయం చేసినట్లు సీఎం రేవంత్ వివరించారు.

## రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా సభల పేరిట నాటకాలు

మొదటి పేజీ తరువాయి

టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకో. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు. కేసీఆర్ టంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.



## దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

మొదటి పేజీ తరువాయి

ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహానుభావుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని ఆకాంక్షించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ కల సాకారం అవుతుందన్నారు. స్వయంకృషితో రాష్ట్రపతిగా ఎదిగిన వ్యక్తి ద్రౌపది ముర్ము అని కొనియాడారు. విద్యార్థులను భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా13 మందికి రాష్ట్రపతి బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మంత్రి సంధ్యారాణి, ట్రైబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, వీసీ పాల్గొన్నారు.

## ఆలయ భూ కేటాయింపుల్లో పారదర్శకత

**హైదరాబాద్, జూన్ 30 (నమస్తే ఉదయం)**

స్థలాలు ఎవరికి కేటాయించినప్పటికీ, ఆయా భూములపై పూర్తి యాజమాన్య హక్కులు మాత్రం ఆలయాలకే ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లకిeనరసింహ స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి, భూ కేటాయింపులపై ఉన్నతాధికారు లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ భూముల పరిరక్షణ, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన నిర్మాణాలపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు భూమి కేటాయింపు విషయమై స్పందిస్తూ, సదరు ల్యాండ్‌ను ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారమే కేటాయించాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే, ఆలయ పరిధిలో వివిధ మఠాలకు స్థలాలు ఇచ్చే అంశంపై స్పష్టమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కుల సంఘాలకు స్థలాల కేటాయింపులపై కూడా నిర్దిష్ట నిబంధనలతో కూడిన ఒక పాలసీని సిద్ధం చేయాలని చెప్పారు. ఈ భూ కేటాయింపుల ప్రక్రియలో దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో అనుసరిస్తున్న నిబంధనలు, విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశర చేశారు. యాదగిరిగుట్టపై భక్తుల వసతి కోసం నిర్మించతలపెట్టిన అతిథిగృహాల నిర్మాణంలోనూ తిరుమల మోడల్‌నే అనుసరించాలని పేర్కొన్నారు. కొండపై కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపే దాతలు, సంస్థల వివరాలతో కూడిన జాబితాను తక్షణమే రూపొందించాలని, వీరికి విడతలవారీగా నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పబ్లిక–ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణ పనులు, నాణ్యతపై గతంలో నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, దానిపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను తనకు అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు గడువు విధించారు

## జన్మతః పౌరసత్వం.. ట్రంప్‌నకు సుప్రీంలో షాక్

మొదటి పేజీ తరువాయి

అవకాశం కల్పించే హక్కు. ఈ దేశంలో జన్మించే ప్రతి వ్యక్తికి వీటిని అందిస్తామని 14వ సవరణ రూపకర్తలు హామీ ఇచ్చారు. ఆ వాగ్దానాన్ని మేము ఈరోజు నిలబెట్టుకుంటున్నాం'' అని సవరణపై చట్టసభలో చర్చను ప్రస్తావిస్తూ చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ తీర్పు వెల్లడించారు. అమెరికాలో జన్మించే ప్రతి ఒక్కరికీ పౌరసత్వ హక్కును కొనసాగించాలని సుప్రీం ధర్మాసనంలోని మెజార్టీ సభ్యులు పేర్కొన్నారు. ఇదిలాఉంటే, గ్రీన్‌కార్డు హోల్డర్లు కానివారి పిల్లల పౌరసత్వాన్ని గుర్తించవద్దని ట్రంప్ గతంలో ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, దిగువ కోర్టులు వీటిని తిరస్కరించగా.. తాజాగా సుప్రీం కోర్టు కూడా దిగువ కోర్టుల నిర్ణయాన్ని సమర్థించింది.

# ఉద్యోగ విరమణ పొందిన జి మురళీధర్‌కు ఘన సన్మానం



జి మురళీధర్ కు పెన్షన్ పత్రాలు అందచేస్తున్న ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ రిజిస్ట్రార్ మనోజ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ రఘు లు



ఉద్యోగ విరమణ పొందిన బి పద్మారావు, జి మురళీధర్ లతో సీనియర్ జర్నలిస్టు అప్పారెడ్డి గూడెం భీమయ్య, మాధవి లు

**బుద్వేల్, జూన్ 30 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్, పంచాయతీ రాజ్ (ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్) లో 35 సంవత్సరాల కు పైగా డ్రైవర్ గా పని చేసి మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన రాజేంద్రనగర్ వాస్తవ్యులు జి మురళీధర్ కు ఆ సంస్థ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఘనంగా సన్మానం చేశారు. ముందుగా ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ రిజిస్ట్రార్ మనోజ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ రఘు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ (టి) వందన లు మురళీధర్ సేవలను కొనియాడారు. అనంతరం మురళీధర్ కు పెన్షన్ పేపర్స్ ను అందచేశారు. మురళీధర్ మృదు స్వభావి అని, విధి నిర్వహణ లో బాధ్యతాయుతంగా మెలిగే వారని గుర్తు చేసుకున్నారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో, ఐస్టశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో విలసిల్లాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామన్నారు.

**నన్ను పెంచి, నా కుటుంబాన్ని పోషించిన సంస్థ ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ : జి మురళీధర్**

నా తల్లి తండ్రులు నన్ను కని పెద్ద చేస్తే ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ నన్ను పోషించిందని మురళీధర్ గుర్తు చేసుకున్నారు. తననే కాక తన కుటుంబ సభ్యుల ను పోషించిన సంస్థ ను ఎన్నటికీ మరచి పోనన్నారు.

**మురళీధర్ ను కొనియాడిన సోదరులు, కుటుంబ సభ్యులు:**

ఉద్యోగ విరమణ పొందిన జి మురళీధర్ ను సోదరులు జి వేణుగోపాల్, ఎ భీమయ్య, కుమార్తె రోహిణి లతో పాటు సంస్థ అధికారులు, సహచర ఉద్యోగులు అభినందించి ఆయన మంచి తనాన్ని గుర్తు చేసుకున్నారు. సన్మాన కార్యక్రమంలో మురళీధర్ సతీమణి జి లత, బావ టి కృష్ణ, చెల్లెలు టి పద్మ (గీత) , అక్క ఎం అన్నపూర్ణ, మరదలు జి మానస, కూతురు మోన, అల్లుడు వికాస్, సోదరుని కుమార్తె తనిష్క (మేఘన) , అల్లుడు శ్రీమన్నారాయణ, సుశ్రీత శ్రీ, దీపు, ధీరజ్ లతో పాటు వికాస్ తల్లి తండ్రులు, బంధువులు పాల్గొన్నారు



ఉద్యోగ విరమణ పొందిన జి మురళీధర్ తో కుటుంబ సభ్యులు, బంధువులు



జి మురళీధర్ కు బహుమతి అందచేస్తున్న ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ ఉన్నతాధికారులు

## బాలికలపై లైంగిక దాడి కేసుల్లో ఇద్దరికి జైలు


**రాజేంద్రనగర్,జూన్30(నమస్తే ఉదయం)**



మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితునికి రాజేంద్రనగర్ ఫోక్సో కోర్టు న్యాయమూర్తి టి.శ్రీనివాస్ 5 సంవత్సరాల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ...రాజేంద్రనగర్ బుద్వేల్ శివసాయి కాలనీకి చెందిన ఎం.సత్యనారాయణ (52) పెయింటర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. 2022వ సంవత్సరం మార్చి 22వ తేదీన ఇంటిముందు ఆడుకుంటున్న మైనర్ బాలికను ఇంట్లోకి పిలిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు.మైనర్ బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుని రిమాండ్ తరలించారు.ఈ కేసులో న్యాయమూర్తి మంగళవారం నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతోపాటు1000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.బాధితురాలికి 50వేల రూపాయల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. మరో కేసులో. షాపులో బొమ్మలు కొనుక్కునేందుకు వచ్చినా మైనర్ బాలుడిని లైంగికంగా వేధించిన కేసులో నిందితుడికి రాజేంద్రనగర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి టి.శ్రీనివాస్ మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...బండ్లగూడ ప్రాంతానికి చెందిన పి.వేణుగోపాల్ బండ్లగూడ ప్రధాన రహదారిపై ఉన్న టాయ్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు.ఈ దుకాణంలో 2022 మార్చి 1వ తేదీన స్థానికంగా ఉండే 11సంవత్సరాల బాలుడు బొమ్మలు కొనుక్కునేందుకు వచ్చాడు.ఈ సమయంలో పి.వేణుగోపాల్ ఆ బాలుడి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు.దీంతో బాలుడు తల్లిదండ్రులకు విషయాన్ని తెలపడంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ కేసులో న్యాయమూర్తి మంగళవారం నిందితునికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు.బాలుడికి 50 వేల రూపాయల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

## ఐదు నెలల చిన్నారి మృతదేహం లభ్యం

**బుద్వేల్, జూన్30( నమస్తే ఉదయం) :**




ఐదు నెలల వయస్సు ఉన్న శిశువు మృతదేహాన్ని గుర్తుతెలియని మహిళ పార్కు స్థలంలో వదిలేసిన హృదయవిదారక ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది.సుమారు ఐదు నెలల వయస్సు ఉన్న శిశువు మృతదేహాన్ని గుర్తుతెలియని మహిళ పార్కు స్థలంలో వదిలేసి పరారైంది.ఈ ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని ఓ పార్కు స్థలంలో శిశువు మృతదేహం కనిపించడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.సుమారు ఐదు నెలల వయస్సు ఉన్న శిశువు మృతిచెందిన అనంతరం గుర్తుతెలియని మహిళ పార్కులో వదిలేసి వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు,పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తూ శిశువును వదిలేసిన మహిళను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు.శిశువు మృతికి గల కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## మద్యం మత్తులో రోజు కూలీ ఆత్మహత్య

**బుద్వేల్, జూన్30 (నమస్తే ఉదయం) :**

మద్యం మత్తులో రోజు కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైలార్ దేవ్ పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసుస్టేషన్ పరిధిలోని లక్మిగూడ రాజీవ్ గృహకల్పకు చెందిన రతన్ కిషన్(37) మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.విషయం గ్రహించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆత్మహత్య చేసుకున్న రతన్ కిషన్

# ఉద్యోగ విరమణ పొందిన బాంద్ర పద్మారావు కు ఘన సన్మానం



బాంద్ర పద్మారావు కు పెన్షన్ పేపర్స్ అందచేస్తున్న ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ రిజిస్ట్రార్ మనోజ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ రఘు




బి పద్మారావు ను సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



పద్మారావు బహుమతి ఇస్తున్న నవ జ్యోతి యూత్ క్లబ్ సభ్యులు

**బుద్వేల్, జూన్ 30 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్, పంచాయతీ రాజ్ (ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్) లో ఉద్యోగం చేస్తూ మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన రాజేంద్రనగర్ వాస్తవ్యులు బాంద్ర పద్మరావు ను ఆ సంస్థ అధికారులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఘనంగా సన్మానం చేశారు. ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ లో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆ సంస్థ రిజిస్ట్రార్ మనోజ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ రఘు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ (టి) వందన లతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు సన్మానించి పద్మారావు సేవలను కొనియాడారు. పద్మారావు శేష జీవితం ఆయురారోగ్యాలతో, ఐస్టశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో విలసిల్లాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పద్మారావు సతీమణి శకుంతల, కుమార్తెలు తేజస్వి, రోజస్వి, యశస్వి, అల్లుళ్ళు దిలీప్, సాయి కుమార్ లతో పాటు అత్తమ్మ బి లక్ష్మీ, ఎన్ చెన్నయ్య, ఎ భీమయ్య, చంద్రకళ, మాధవి, సంజయ్ కుమార్, మౌనిక లతో పాటు బంధువులు బాబురావు, జగన్, ఎం రాజు, రమేష్,



పద్మారావు కుటుంబ సభ్యుల తో అప్పారెడ్డి గూడెం భీమయ్య దంపతులు



పద్మారావు కు సన్మానం చేస్తున్న బి సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులు

రామచందర్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**నవ జ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో....**

రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షుడు మంగలారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో యూత్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ సభ్యులు పద్మరావు నివాసంలో జరిగిన ఉద్యోగ విరమణ సభలో పాల్గొని ఆయనను సన్మానించారు. సన్మానించిన వారిలో మాజీ అధ్యక్షులు ఎస్ జగదీశ్వర్, ఎం ఎ నయీమ్, వై గోపాల్, ఎస్ వెంకటేశం, కొల్లమీది యాదయ్య ముదిరాజ్, ఏ భీమయ్య, ఎస్ కే శ్యామ్సన్, ఎస్ గంగాధర్, ఎస్ వెంకటేష్, ఎం నాగభూషణం, గజ్జల శ్రీనివాస్, పి ఉదయ్ కిరణ్, ఎం ప్రవీణ్, ఎం వినయ్, పి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

**చిన్న నాటి మిత్రుల ఆధ్వర్యంలో....**

పద్మారావు తో పాటు కలసి చదువుకున్న ఏ సుబ్బారావు, కృష్ణా రెడ్డి, పి శ్రీశైలం, ఎం విజయ్ కుమార్, సి అశోక్, సీ కే రమేష్ తదితరులు పాల్గొని సన్మానం చేశారు.



తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ కు ఎన్యూమరేషన్ ఫారాన్ని అందచేసి సన్మానిస్తున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, తదితరులు



బుద్వేల్‌లో ఎన్యూమరేషన్ ఫారాన్ని ఓటర్ల కు అందచేస్తున్న బీ ఎల్ ఓ మమత, బీజేపీ నాయకులు బండారి బాలకృష్ణ



వ్యవసాయ విశ్వవిద్యాలయం వరి పరిశోధన సంస్థ హెడ్ డాక్టర్ స్వర్ణలత రెడ్డి ని సన్మానిస్తున్న ఆ సంస్థ ఉద్యోగులు



వ్యవసాయ విశ్వవిద్యాలయం కు చెందిన డాక్టర్ నీరజ ప్రభాకర్ (ఉద్యాన విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్) ను సన్మానిస్తున్న వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యోగులు పోతురాజు యాదయ్య, ఎం రాజు, కె ప్రవీణ్ కుమార్, బి శంకు స్వామి తదితరులు




నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

## ఇద్దరు పాత నిరస్తుల అరెస్టు 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం.

**బుద్వేల్, జూన్ 30 (నమస్తే ఉదయం)**

పార్కు చేసిన వాహనాలను దొంగలించి తప్పించుకుని తిరుగుతున్న ఓ ముఠాలోని ఇద్దరినీ అత్తాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ ముఠాలోని మరో ఇద్దరు పరారీలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. వీరిపై అత్యాయత్నం కేసుతోపాటు దొంగతనాల కేసులు వివిధ పోలీస్ స్టేషన్లో నమోదయి ఉన్నాయని పోలీసులు వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫుల్ బాగ్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ షా నవాజ్ (18) ప్రైవేటు ఉద్యోగి ఇతనికి ఫలక్ నుమా ప్రాంతానికి చెందిన మొహమ్మద్ మోయిజ్ మోహియుద్దిన్ (18 ) శాస్త్రి పురం ప్రాంతానికి చెందిన నూర్ ఇదే ప్రాంతానికి చెందిన పర్వాన్ లు స్నేహితులు. షా నవాజ్ తోపాటు ఫర్వాన్ లపై బాలాపూర్ పోలీస్ స్టేషన్లో అత్యాయత్నం కేసులు నమోదయి ఉన్నాయి. వీరంతా ద్విచక్ర వాహనాలను దొంగలిస్తూ తమకు డబ్బులు అవసరం అయిన సమయంలో వాటిని విక్రయించి జల్సా లకు పాల్పడేవారు.కేవలం ఖరీదైన వాహనాలను మాత్రమే దొంగలించి వాటిపైనే తిరుగుతూ జల్సా చేసేవారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివరాంపల్లి ప్రాంతంలో నరసింహ తన దుకాణం ముందు ఈనెల 25వ తేదీన తన రాయల్ ఎన్ఫీల్డ్ వాహనాన్ని పార్కు చేసి పని నిమిత్తం బయటకు వెళ్ళాడు. పని అనంతరం వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. పార్కు చేసిన వాహనాన్ని గమనించిన ఫర్వాన్ విషయాన్ని ముగ్గురు స్నేహితులకు తెలిపాడు. దొంగలించిన తెల్లని హోండా వాహనంపై ముగ్గురు నిందితులు ఫర్వాన్ తెలిపిన స్థలానికి చేరుకొని వాహనాన్ని దొంగలించి పారిపోయారు. వాహన యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.ఇందులో భాగంగా మంగళవారం ఉదయం షానవాజ్, మోహియుద్దీన్లు దొంగలించిన వాహనంలో వెళ్తుండగా అత్తాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో మరో నాలుగు వాహనాల విషయాన్ని తెలపడంతో వాటిని స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసు నమోదు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని త్వరలో వారిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# రాష్ట్ర పోలీస్ అకాడమీలో పదవి విరమణ చేసిన ఇద్దరు ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు





**హైదరాబాద్ (బండ్లగూడ) జూన్ 30, (నమస్తే ఉదయం)**

ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా పదవీ విరమణ సన్మాన కార్యక్రమం43 ఏళ్ల నిబద్ధతతో సేవలందించిన ఎస్ఐ డ్రైవర్ జి. బాలరాజు, 33 ఏళ్ల క్రమశిక్షణతో సేవలందించిన ఆఫ్సెట్ మెషీన్ ఆపరేటర్ టి. ఎల్లయ్యకు ఘన సన్మానంహైదరాబాద్:ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో మంగళవారం పదవీ విరమణ పొందిన ఇద్దరు ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ లో సబ్ ఇన్‌స్పెక్టర్ (డ్రైవర్) గా సేవలందించిన జి. బాలరాజు, అకాడమీ రీప్రోగ్రఫీ (ప్రింటింగ్ ప్రెస్) విభాగంలో ఆఫ్సెట్ మెషీన్ ఆపరేటర్‌గా సేవలందించిన టి. ఎల్లయ్యలకు అకాడమీ కుటుంబం ఘనంగా సన్మానం చేసింది.ఈ కార్యక్రమానికి తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ, జి. బాలరాజు సుమారు 43 సంవత్సరాలపాటు పోలీస్ శాఖలో అత్యంత నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహించారని కొనియాడారు. సబ్ ఇన్‌స్పెక్టర్ (డ్రైవర్) గా ఉన్నతాధికారులను ప్రతిరోజూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆయన చూపిన బాధ్యతాయుత సేవలు ఆదర్శప్రాయమని ప్రశంసించారు.అలాగే టి. ఎల్లయ్య రీప్రోగ్రఫీ విభాగంలో సుమారు 33 సంవత్సరాలపాటు అత్యంత క్రమశిక్షణతో సేవలందించారని పేర్కొన్నారు. పదవీ విరమణ రోజున కూడా శిక్షణార్థుల పరీక్షల నిర్వహణకు సంబంధించిన విధులు నిర్వర్తించడం ఆయన విధి పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనమని అభినందించారు.మోటార్ ట్రాన్స్‌పోర్ట్ , రీప్రోగ్రఫీ (ప్రింటింగ్ ప్రెస్) విభాగాలలో పనిచేస్తూ శిక్షణా కార్యక్రమాలకు అవసరమైన గెస్ట్ ఫ్యాకల్టీ రవాణా, శిక్షణార్థుల పరీక్షల ప్రశ్నపత్రాల ముద్రణలో అత్యంత గోప్యతను కాపాడడం వంటి కీలక బాధ్యతలను ఇద్దరూ సమర్థవంతంగా నిర్వహించి అకాడమీ ప్రతిష్ఠను మరింత పెంచారని డైరెక్టర్ పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం ఇద్దరూ ఆరోగ్యంగా, ఆనందంగా, కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవితం గడపాలని డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అకాడమీ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో డైరెక్టర్ అభిలాష్ బిస్త్, ఐపీఎస్‌తో పాటు ఉన్నతాధికారులు జి. బాలరాజు, టి. ఎల్లయ్యలను శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు మరియు కానుకలు అందజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, కె.ఆర్.కె. ప్రసాద్, శ్రీరామమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ వేముల శ్రీనివాసరావు, డీఎస్పీలు జ్ఞానేశ్వర్ రెడ్డి, రామారావు, తోట శ్రీనివాసులు ఇండోర్, ఔట్‌డోర్ ఫ్యాకల్టీ సభ్యులు, అకాడమీ సిబ్బంది, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## సీఎం సహాయ నిధి..పేదలకు పెన్నిధి

**ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,జూన్30(నమస్తే ఉదయం)**

సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలోని తన నివాసం వద్ద అనారోగ్యంతో బాధపడుతూ వివిధ దవాఖానల్లో చికిత్స పొందిన లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజురైన చెక్కులను పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు.నియోజకవర్గంలో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు ఎమ్మెల్యే చెప్పారుపేద ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని,ఆపదలో ఉండి ప్రైవేట్ ఆసుపత్రులలో ఖరీదైన వైద్యం చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఆసరాగా నిలుస్తుందని అన్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ డివిజన్ల సీనియర్ నాయకులు టి.ప్రేమ్ గౌడ్,రగడంపల్లి శ్రావణ్,ధనంజయ్,శ్రీనివాస ట్రస్ట్ వ్యవస్థాపకుడు పెండ్యాల సాయి మాలిక్,కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలలో ల్యాబ్ లు ఏర్పాటు:

**తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈ నికోలస్**

**వనస్థలిపురం, జూన్ 30(నమస్తే ఉదయం)**

తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈ నికోలస్ మంగళవారం జిల్లా పరిషత్ హై స్కూల్ సాహెబ్ నగర్ ,హయత్ నగర్ మండల్ రంగారెడ్డి జిల్లా ను సందర్శించి వివిధ రకాల లాబరేటరీ లను ప్రారంభించారు .వీటిలో ఫిజిక్స్ ల్యాబ్ ,బయాలజీ ల్యాబ్ ,అపరైల్ మరియు ఫుడ్ అండ్ బేవరేజెస్ ల్యాబ్ లను ప్రారంభించారు. వీటి ద్వారా విద్యార్థులకు అనుభవపూర్వక బోధన జరుగుతుందన్నారు ఇది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యక్షంగా నేర్చుకొనుటకు దోహదపడును అని తెలిపారు .తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ స్వయంగా ఈ పాఠశాలలో మోడల్ లేబరేటరీ కాంప్లెక్స్ గా దీనిని ప్రారంభించారు. దీనిని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ స్వయంగా తన మార్గదర్శకత్వం లో ఎన్ ఓ ఆర్ డి సహకారంతో ప్రారంభించారు. .ల్యాబ్ లను



ప్రారంభించిన తర్వాత డైరెక్టర్ స్వయంగా అన్ని ల్యాబ్లను పరిశీలించి విద్యార్థుల ఉత్సకతను తెలుసుకొని వారిని ఎంతో ప్రోత్సహించారు. పనులు ప్రారంభించి చాలా త్వరితగతంగా పూర్తి చేసినందుకు డిప్యూటీ ఈఈ ప్రదీప్ నిఅభినందించారు.తరువాత పాఠశాల గదులను,ఆవరణను పూర్తిగా పరిశీలించి ప్రధానోపాధ్యాయులను సిబ్బందిని పిల్లల్లో సాంకేతిక భావనను పెంపుందేలా కృషి చేసినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దినేష్ , కమ్యూనిటీ మెంబర్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి ల్యాబ్ లను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా లేబరేటరీ మోడల్ కాంప్లెక్స్ ను రంగారెడ్డి జిల్లాలో ప్రారంభించినందుకు జిల్లా విద్యాశాఖ అధికారి సుంకేసుల వెంకటేశ్వర్లు డైరెక్టర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.



## హైదరాబాద్‌కు నిరంతరాయ నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

**విద్యుత్ సరఫరా వ్యవస్థలను పరిశీలించిన జలమండలి జేఎండీ**

**హైదరాబాద్, జూన్ 30(నమస్తే ఉదయం)**

హైదరాబాద్ నగరానికి మంజీర, సింగూరు జలవనరుల నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్న పంపింగ్ స్టేషన్లకు విద్యుత్‌ను అందిస్తున్న విద్యుత్ లైన్లు, టీజీఎస్‌పీడీసీఎల్ సబ్‌స్టేషన్, 3.3 కేవీ సబ్‌స్టేషన్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను జలమండలి జాయింట్ మేనేజింగ్



డైరెక్టర్ మయాంక్ మిట్టల్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వర్షాలు, ఈదురుగాలులు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల సమయంలో చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడటం, విద్యుత్ స్తంభాలు, పరికరాలు దెబ్బతినడం వంటి కారణాలతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల పంపింగ్ వ్యవస్థలకు అంతరాయం ఏర్పడి, హైదరాబాద్ నగరానికి తాగునీటి సరఫరాపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో జేఎండీ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులను జేఎండీ ఆదేశించారు. విద్యుత్ లైన్ల వెంట ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను ముందుగానే తొలగించడం, బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, పరికరాలను పటిష్ఠపరచడం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించే ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచడం,ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఏర్పాట్లను బలోపేతం చేయడం వంటి చర్యలను చేపట్టాలని సూచించారు.హైదరాబాద్ నగరానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా జలమండలి--టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ శాశ్వత పరిష్కార చర్యలను అమలు చేయాలని జేఎండీ మయాంక్ మిట్టల్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీజీఎం రాజశేఖర్, జీఎం రామకృష్ణ, (ట్రాన్స్‌మిషన్ డివిజన్--××) , డీజీఎంలు, మేనేజర్లు, టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.



## కాటేదాన్లో అక్రమ జర్దా తయారీ కేంద్రంపై పోలీసుల దాడి..

**20 కేజీల తంబాకు,110 డ్రమ్ము జర్దా పట్టివేత**

**రాజేంద్రనగర్/బుద్వేల్, జూన్30(నమస్తే ఉదయం)**

కాటేదాన్ లో అక్రమంగా జర్దా తయారు చేస్తున్న గోదాంపై మైలార్దేవ్పల్లి పోలీసులు మంగళవారం దాడులు చేశారు.విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన తనిఖీల్లో ప్రభుత్వం నిషేధించిన తంబాకు ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు గుర్తించారు.ఘటనా స్థలంలో ఉన్న తనారామ్(36) ను అదుపులోకి తీసుకుని విచారించగా,బేగంబజార్కు చెందిన వ్యక్తుల ఆదేశాలతో జర్దా తయారు చేసి హైదరాబాద్లోని పాన్ షాపులు,ఇతర దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించాడు.దాడిలో 20 కిలోల తంబాకు,110 డ్రమ్ము జర్దా,ప్యాకింగ్ సామగ్రి,తయారీ యంత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు మైలారేవ్పల్లి పోలీసులు వెల్లడించారు.



## ఏవీబీ పురం స్థానికుల సమస్యలను ప్రభుత్వ అధికారులు వెంటనే పరిష్కరించాలి

**జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్**

**కూకట్ పల్లి, జూన్ 30 (నమస్తే ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గంలోని ఏవీబీ పురం వాసుల పిలుపు మేరకు నియోజక వర్గం జనసేన పార్టీ కంటెస్ట్ ఎంఎల్ఏ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ కాలనీ వెళ్లి ప్రెసిడెంట్ సింహాద్రి, ప్రధాన కార్యదర్శి వెంకట్ రావు, స్థానికులు తో కలిసి కాలనీ లో తిరుగుతూ అక్కడ నివాసం ఉంటున్న వారు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ఏవీబీ పురం లో మోరీలు నిత్యం పొంగుతున్నాయని, వర్షకాలం మరి ఎక్కువ సమస్యగా ఉందని, సుమారు వంద కుటుంబాలు నివాసం ఉంటున్న సెంట్ రిటా హై స్కూల్ వెనుక, రోడ్ నంబర్ - 11 లొ మంజీర, డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం బాధాకరం అని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించి నివాసులకు ఊరట నివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, శివశంకర్ కాలనీ ఆర్. వాసు,గోవింద్, లక్ష్మీనారాయణ, బాబూరావు, భాస్కర్ రావు, తిరుపతి, ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు

**వెల్ఫేర్ బోర్డు నుండే సంక్షేమ పథకాలు కార్మికులకు అందించాలి**

**సిఎస్సి సంస్థ హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలి**

**సహజ మరణానికి రూ.5 లక్షలకు పెంచాలి**

**సీఐటీయూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్**

**కూకట్ పల్లి, జూన్ 30 (నమస్తే ఉదయం)**

భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో లో కూకట్ పల్లి లో నిరసన అనంతరం కూకట్ పల్లి తహసిల్దార్ కార్యాలయం లో డిప్యూటీ తాసిల్దార్ జ్యోతి కి సీఐటీయూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ వినతి పత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ మూడు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 12ను జూలై తేది: 22-07-2025న విడుదల చేసింది. జీఓ విడుదల చేసిన వెంటనే ట్రైయిల్ బ్లైజర్ అనే బ్రోకర్స్ సంస్థ ద్వారా రూ.346 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు బదిలీ చేశారు. కార్మికులకు ఎటువంటి ఉపయోగం లేని సిఎసి సి హెల్త్ టెస్టులు చేస్తూ రూ.750 కోట్లకు పైగా ఆ సంస్థకు ఇచ్చి వెల్ఫేర్ బోర్డు సెస్సు నిధులు దుబారా చేశారు. కేంద్ర చట్టం, రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు, సిఎస్సి సంస్థకు వందల కోట్లు కట్టబెట్టడం దుర్మార్గం అని అన్నారు. 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని



నియమించి వారి నిర్ణయం ప్రకారమే బోర్డు నిధులను ఖర్చు చేయాలి. కానీ వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించకుండా ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడి ఎలాంటి గుర్తింపు లేని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్కీములను అప్పగించి పేద నిర్మాణ కార్మికుల నోట్లో మట్టిగొడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2009 నుండి 2025 వరకు బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులు 28 లక్షల 50 వేల మంది ఉండగా, 16 లక్షల మందిని మాత్రమే రెన్యువల్ చేసి ఒక్కొక్క కార్మికుడికి ప్రీమియం రూ.2,309/-ల చొప్పున 15 లక్షల మంది కార్మికులకు రూ.346.36 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పనంగా కట్టబెట్టారు. 2025 జూలై 24 నుండి ఇప్పటివరకు ఇన్సూరెన్స్ కంపెనీ వారు కార్మికులకు చెల్లించిన నష్టపరిహారాలు రూ.140 కోట్లు మాత్రమే. సుమారు రూ.200 కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలకు మిగిల్చారు. బోర్డు నుండి డేటా ఇవ్వలేదని సాకు చూపి వేలాది మంది కార్మికులకు నష్టపరిహారాలు ఇవ్వకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకొని వందల కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలు దోచుకున్నాయి. 13 లక్షలకు పైగా కార్మికుల కార్డులు రెన్యువల్ చేయకుండా వారికి అన్యాయం చేస్తున్నారు. వివాహ కానుక, ప్రసూతి కానుక, హాస్పిటల్ ఖర్చులు, దహన సంస్కారాల ఖర్చుల వంటి తదితర స్కీములను ప్రభుత్వం, బోర్డు అధికారులు అనేక కారణాలు చూపి కార్మికులకు అందకుండా చేస్తున్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాలకు నిధులు సకాలంలో విడుదల చేయకుండా, కొత్త సంక్షేమ పథకాలు పెట్టకుండా ప్రభుత్వం బోర్డు నిధులను దుబారా చేస్తున్నది. కావున ప్రభుత్వం వెంటనే ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన రద్దు చెయ్యాలి కార్మికుల ను ఆదుకోవాలి వారికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి, సహజ మరణ కార్మికులకు 5లక్ష లు వెల్ఫేర్ బోర్డు నుండి ఇవ్వాలి అని మాట్లాడారు. ఈ కార్యక్రమం లో భవన నిర్మాణ సంఘం, కూకట్ పల్లి మండల కార్యదర్శి బి. రాములు, సమ్మయ్య, మోహన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.